క్లుప్తంగా

దేవాదులలో మరో మోటారు ప్రారంభం

కన్నాయిగూడెం : మండలంలోని తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన జె.చొక్కారావు ఎత్తిపోతల వద్ద మంగళవారం మరో మోటారుతో నీటి పంపింగ్‌ను ప్రారంభించారు. ఇటీవల ఒక మోటర్‌తో పంపింగ్‌ను కొనసాగిస్తుండగా, ఇప్పుడు మరో మోటరుతో 583 క్యూసెక్కుల నీరు దిగువకు పంపింగ్ చేస్తున్నట్లు డీఈ శరత్ తెలిపారు. ఇన్ టెక్ వెల్‌లో మూడు ఫేజ్‌లలో 10 మోటర్లు ఉండగా అందులో ఫేజ్ త్రీలో ఆరు మోటర్లు ఉన్నాయి. ప్రస్తుతం ఇన్‌టెక్ వెల్ వద్ద 77.50మీటర్ల నీటి మట్టం కొనసాగుతోంది. దిగువన నీటి లభ్యతను బట్టి మోటర్లు ఆన్ చేయడం జరుగుతుందని డీఈ శరత్ తెలియజేశారు. సమ్మక్క బ్యారేజీ వద్ద ప్రస్తుతం ఎగువ నుంచి బ్యారేజీలోకి 2,68,070 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అక్కడ ఉన్న 59 గేట్లను ఓపెన్ చేసి 2,67,487 క్యూసెక్కుల నీరు దిగువకు వదులుతున్నారు. ప్రస్తుతం బ్యారేజీలో 76.70 నీటి మట్టం కొనసాగుతోంది.

దరఖాస్తుల ఆహ్వానం

ములుగు : జిల్లా న్యాయసేవా అధికార సంస్థ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టంలో ఏడాది పాటు ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాల నియామకానికి నిరుద్యోగల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్ పర్సన్ నోటిఫికేషన్ జారీచేశారు. ఆఫీస్ అసిస్టెంట్ (2), వేతనం రూ.20,000లు, డిగ్రీతో పాటు కంప్యూటర్ నైపుణ్యం కలిగి ఉండాలని, నిమిషానికి 40 పదాల చొప్పున టైప్ వచ్చి ఉండాలని తెలిపారు. ఆఫీస్ ప్యూన్ (మున్షి/అటెండెంట్) (2)కు 7వ తరగతి పాస్ కావాలని పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో శనివారంలోపు రిజిస్టర్ /స్పీడ్ పోస్ట్ లేదా కొరియర్ ద్వారా చైర్ పర్సన్ డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీస్ అథారిటీ, ములుగు, డిస్ట్రిక్ట్ కోర్ట్ కాంప్లెక్స్ అడ్రస్‌కు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఐటీఐలో ప్రవేశాలకు..

ఏటూరునాగారం: వాజేడు, ఏటూరునాగారం ఐటీఐ కళాశాలల్లో ఖాళీగా ఉన్న వివిధ ట్రేడ్‌ల సీట్లను భర్తీ చేసేందుకు మూడో విడత ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆన్‌లైన్ దరఖాస్తులు ఈనెల 17వ తేదీలోపు చేసుకోవాలని సూచించారు. ఐటీఐలో ఉన్న ట్రేడ్‌లు ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, డీజిల్ మెకానిక్, వెల్డర్, ఫిట్టర్ కోర్సుల్లో చేరేందుకు పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన ఆసక్తిగల విద్యార్థులు ఆన్‌లైన్ చేసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం



కన్నాయిగూడెం : మండల కేంద్రానికి చెందిన అరికాల్ల లక్ష్మయ్య ఊపిరితిత్తుల సమస్యతో ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం కావడంతో ఆర్థిక స్తోమతతో సతమతమవుతున్నారు. దీంతో దాతలు ఆదుకోవాలని కోరగా ముప్పనపల్లి సహాయ నిధి సభ్యులు చేయూతనిచ్చారు. ఈ మేరకు మంగళవారం రూ.6,000ల నగదు అందజేశారు.

న్యాయం చేయాలి

ఏటూరునాగారం : ఈ ఏడాది జనవరి 1వ తేదీన ఏటూరునాగారంలో జరిగిన సంఘటనపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ స్పందించి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదేశాలు ఇవ్వడం సంతోషకరమని మూఢనమ్మకాల నిర్మూలన సంఘం జిల్లా అధ్యక్షుడు కొండగొర్ల రాజేష్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. దీనిపై పూర్తి విచారణ చేపట్టి న్యాయం చేయాలని కోరారు.

యువకుడి ఆత్మహత్య

వెంకటాపురం(ఎం): కడుపునొప్పి భరించలేక కావటి కార్తీక్ (23) అనే యువకుడు క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఎస్సై జక్కుల సతీష్ తెలిపిన వివరాల ప్రకారం.. కార్తీక్ గత ఆరు నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం కడుపునొప్పి తీవ్రంగా రావడంతో ఇంటి వద్దనే క్రిమిసంహారక మందు తాగి ఆత్మహత్యకు పాల్పడగా, గమనించిన కుటుంబ సభ్యులు కార్తీక్‌ను చికిత్స నిమిత్తం ములుగు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో వైద్యులు వరంగల్‌కు రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం కార్తీక్ మృతి చెందినట్లు ఎస్సై వెల్లడించారు. మృతుడి తండ్రి రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మృతుడి వివరాల గుర్తింపు

ఏటూరునాగారం : మండలంలోని రొయ్యూర్ పరిధి 163 జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తిని గుర్తించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ జిల్లా సిందనూర్ గ్రామానికి చెందిన పింటు సర్కార్(35గా గుర్తించినట్లు ఎస్సై తాజొద్దీన్ తెలిపారు. ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వరద తగ్గింది.. బురద మిగిలింది

- ఏజెన్సీ గ్రామాలకు తప్పని తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



శుద్ధవాగులో ట్రాక్టర్‌ను తాడుతో లాగుతున్న మరో ట్రాక్టర్



మల్కపల్లిలో పొలాన్ని తలపిస్తున్న రోడ్డు



ఐలాపూర్ నుంచి మార్గమధ్యలో బురదలో ఇబ్బంది పడుతున్న ద్విచక్రవాహనదారుడు

కన్నాయిగూడెం : ఏజెన్సీ గ్రామాలను వరద వదిలినా.. బురద వదలడంలేదు..రోజు చిన్నపాటి చినుకులతో రోడ్లన్ని చిత్తడిగా మారుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఆ రోడ్లపై వెళ్లాలంటే నానా అవస్థలు పడుతున్నారు. వారం రోజుల క్రితం కురుస్తున్న వర్షాలతో మండలంలోని వాగులు, కాల్వలు పొంగిపొర్లాయి. రోడ్లపై వర్షపు నీరు ప్రవహించడంతో పలు గ్రామాల ప్రధాన రహదారులపై బురద పేరుకుపోయింది. దీంతో పాటు ఇంటర్నల్ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. గుర్రేవులలో రోడ్లు పూర్తిగా బురదమయంగా తయారయ్యాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే ప్రాంతం కావడంతో అనేక మంది ప్రయాణికులు నడిచి వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. రాత్రివేళలో వృద్ధులు పనులపై బయటికి వచ్చి జారీ పడి గాయాలైన సంఘటనలు కూడా లేకపోలేదు. అలాగే ఏజెన్సీ గ్రామాల్లో రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో రవాణకు ఇబ్బందులు తప్పడంలేదు. ఐలాపుర్, సర్వాయి, కంతనపల్లి, భూపతిపురం, మల్కపల్లి గ్రామాల్లో ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి.

ఐలాపూర్‌లో అష్టకష్టాలు..

మండలంలోని ఐలాపూర్ గ్రామం ప్రధాన రహదారి పూర్తిగా బురదరోడ్డుగా తయారైంది. దీంతో గ్రామస్తులకు ప్రయాణ కష్టాలు తప్పడంలేదు. ఏ వస్తువు కావాలన్నా మండల కేంద్రంతో పాటు పొరుగు మండలం ఏటూరునాగారం రావల్సి వస్తుంది. బురదలోనే వాహనాలను తోసుకుంటూ నరకయాతన పడుతున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు పాడైపోతున్నాయి. తమ కష్టాలు ఎప్పుడు తీరుతాయోనని ప్రయాణికులకు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాగులపై తాత్కాలికంగా పోసిన మట్టి రోడ్డు కొట్టుకుపోవడంతో ఒక వాహనాన్ని మరో వాహనం లాగుతూ గమ్యాన్ని చేరుకుంటున్నారు.

గుంతలమయంగా కంతనపల్లి రోడ్డు

ఏటూరునాగారం నుంచి కంతనపల్లి గ్రామానికి సుమారు తొమ్మిది కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఈ రోడ్డంతా గుంతలమయంగా మారి వాహనాలు వెళ్లేందుకు నరకయాతన పడుతున్నారు. కనీసం ప్రైవేటు వాహనాలు రాక, నడచి వెళ్లడమే శరణ్యం. బుట్టాయిగూడెం నుంచి సర్వాయి వరకు ట్రాక్టర్లు పోలేని పరిస్థితి. మల్కపల్లి గొత్తికోయ గ్రామానికి వెళ్లే మట్టి రోడ్డు బురదపొలాన్ని తలపిస్తోంది. అత్యవసరమైతే జారిపడుతున్నట్లు పలువురు వాహనదారులు తెలుపుతున్నారు.

> **ఇబ్బంది పడుతున్నాం..**
> ఐలాపూర్ నుంచి కన్నాయిగూడెం రావాలంటే అష్టకష్టాలు పడుతున్నాం. నడిచి వెళ్లేందుకు సైతం ఇబ్బందిగా ఉంది. వానాకాలంలోనే ద్విచక్రవాహనాలు బురదతో పాడైపోతున్నాయి. అత్యవసరమైతే మా బాధలు వర్ణణాతీతం. ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి రోడ్లు బాగు చేయాలి.
> – ఆలం నాగేష్, ఐలాపూర్

నియామకం



కందిక రాజు, అధ్యక్షుడు



శ్యామ్సన్, ప్రధాన కార్యదర్శి

ఎస్ఎస్‌తాడ్వాయి : స్టేట్ టీచర్ యూనియన్ (ఎస్‌టీయూ) తాడ్వాయి మండల శాఖ అధ్యక్షుడిగా కందిక రాజు, ప్రధాన కార్యదర్శిగా జన్ను శ్యామ్సన్‌ను మంగళవారం ఎన్నుకున్నట్లు జిల్లా అధ్యక్షుడు సతీష్‌కుమార్ తెలిపారు. ఈసందర్భంగా రాజు, శ్యామ్సన్ మాట్లాడుతూ.. సంఘ అభివృద్ధితోపాటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈసందర్భంగా జిల్లా కమిటీ నాయకులకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధాన కార్యదర్శి ఏళ్ల మధుసూదన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సోలం కృష్ణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు సతీష్, కుమార్, రామ్మూర్తి, ప్రవంత్, సుజాత, సమ్మయ్య, విజయ కుమార్ పాల్గొన్నారు.

ఫ్లాగ్ మార్చ్



ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న పోలీసులు

వాజేడు : మండల కేంద్రంలో మంగళవారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ జాతీయ జెండాలతో రహదారుల వెంట ఫ్లాగ్ మార్చ్ చేపట్టారు.

ప్రజల భాగస్వామ్యంతో ఏర్పాటు



కామారం క్రాస్ వద్ద సీసీ కెమెరాను పరిశీలిస్తున్న ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి

ఎస్ఎస్ తాడ్వాయి: ప్రజల భాగస్వామ్యంతోనే సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మండలంలో ఏర్పాటు చేస్తున్న సీసీ కెమెరాలను ఎస్సై మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 18 గ్రామపంచాయతీలకు గాను 16 పంచాయతీల్లో కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాడ్వాయి, కామారం(పీటీ), నార్లాపూర్, బయ్యక్కపేట, వెంగ్లాపూర్, మేడారం, ఊరట్టం, కాల్వపల్లి, కాటాపూర్, దామెరవాయి, నర్సాపూర్(పీఏ), బీరెల్లి, అంకంపల్లి, గంగారం, పంబపూర్, రంగాపూర్ గ్రామాల్లో మొత్తం 50 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అటవీ ప్రాంతంలో ఉన్నా బందాల, లింగాల గ్రామపంచాయతీల్లో కూడా వారం రోజుల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అడ్వాన్స్ టెక్నాలజీ కలిగిన నిఘా నేత్రాలను ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లోని ప్రజందరి భాగస్వామ్యంతో అనుకున్న లక్ష్యం మేరకు అన్ని గ్రామ పంచాయతీల్లో కెమెరాల ఏర్పాటు పూర్తి చేశామన్నారు. జిల్లా ఉన్నాతాధికారుల చేతుల మీదుగా త్వరలో సీసీ కెమెరాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. కాగా, సీసీ కెమెరాల ఏర్పాటు కోసం ప్రజలందరిని చైతన్యం చేస్తూ అహర్నిషలు కృషి చేసిన ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సిబ్బందిని ప్రజలకు అభినందిస్తున్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం..

గోవిందరావుపేట : వానాకాలంలో తలెత్తుతున్న ఇబ్బందులను ఎదుర్కొంటూ సిబ్బంది సహకారంతో నాణ్యమైన విద్యుత్ అందించేందుకు కృషి చేస్తున్నామని ములుగు ఇన్‌చార్జ్ ఏడీఈ స్వామి రెడ్డి అన్నారు. మండలంలోని చల్వాయి గ్రామంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ సమస్యలపై తక్షణమే స్పందించి స్థానిక అధికారులు, సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్తున్నామన్నారు. వర్షాల వల్ల విద్యుత్ సరఫరాలో ఆటంకం కలగకుండా అన్ని జాగ్రత్త చర్యలు చేపట్టామన్నారు. వినియోగదారులు విద్యుత్ బకాయిలను సకాలంలో చెల్లించాలని సూచించారు. సిబ్బంది మెరుగైన విద్యుత్ అందించేందుకు ఎంతగానో శ్రమిస్తున్నారని, తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా, ముప్పు ఉందని తెలిసి కూడా విధుల లో భాగంగా నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు.

‘రైతులను గోస పెడుతున్న ప్రభుత్వం’



మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాం నాయక్

గోవిందరావుపేట: హామీలను అమలు చేయకుండా రైతులను రాష్ట్ర ప్రభుత్వం గోస పెడుతుందని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్ అన్నారు. మండల పరిధిలోని బుస్సాపూర్‌లో మంగళవారం కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు లోడే శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన, బీజేపీ మండల అధ్యక్షుడు తేజరాజు ఆధ్వర్యంలో ప్రశ్నిస్తున్న తెలంగాణ రైతు అనే నినాదంతో రైతు రచ్చబండ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిలుగా మాజీ ఎంపీ అజ్మీరా సీతారాం నాయక్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు సిరికొండ బలరాం, పార్టీ నాయకురాలు చందుపట్ల కీర్తిరెడ్డి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారని వాపోయారు. హామీల అమలులో రైతులను నిబంధనల పేరుతో దగా చేస్తూ, గోస పెడుతున్నారని ఆరోపించారు. పంట రుణం తీసుకున్న ప్రతీ ఒక్క రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రైతుల పక్షాన పోరాడే బీజేపీ నాయకులను గెలిపించుకోన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రవీంద్రచారి, నరేష్, రాష్ట్ర గిరిజన మోర్చా ప్రధాన కార్యదర్శి కొత్త సురేందర్, పెద్ది మహేందర్ రెడ్డి, జినుకల కృష్ణాకర్, రామరాజనేత, వెంకటేశ్వర్లు, సురేష్, కృష్ణమూర్తి, మహిపాల్ రెడ్డి, రవీందర్ రెడ్డి, గాదం కుమార్, రాజశేఖర్, బండి బాబు, వీరభిక్షం, భూక్య శ్రీనివాస్, సుధాకర్, యాకయ్య పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

ములుగు రూరల్ : 15ఏళ్ల క్రితం వలస వచ్చి నివాసముంటున్న ఆదివాసీలకు కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలని సీపీఎం నాయకుడు రత్నం రాజేందర్ కోరారు. ఈ మేరకు మంగళవారం కలెక్టర్ దివాకరకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆదివాసీలు ఉన్నత చదువుల కోసం వారికి కులం సర్టిఫికెట్లు ఇవ్వాలని విన్నవించారు. ఆదివాసీ గూడేలకు తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వలస ఆదివాసీలను గుర్తించి సమస్యలు పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో రాము, ఉంగయ్య, ఆడమయ్య, సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదు చేపడుతున్న నాయకులు

ములుగు రూరల్ : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఎస్టీయూ పని చేస్తోందని జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శిరుప సతీష్, ఏళ్ల మధుసూదన్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని అబ్బాపూర్, జాకారం, గుర్తూర్‌తండా, కొడిశాలకుంట, శ్రీనగర్, మహ్మద్ గౌస్‌పల్లి, రాంచంద్రాపురం ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యా ప్రగతికి తోడ్పాటు అందించడంలో సంఘం నిత్యం ఉపాధ్యాయులకు అందుబాటులో ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో నాయకులు మహ్మద్ హమీద్, అజ్మీరా దశరథం, రమేష్, భాస్కర్‌రావు, రాజయ్య, శ్రీనివాస్, ఆగయ్య, అరుణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



కొత్తమల్లూరులో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న యమున

మంగపేట : మండలంలోని చుంచుపల్లి పీహెచ్‌సీ పరిధి కొత్తమల్లూరు(బెస్తగూడెం)లో వైద్యాధికారి యమున ఆధ్వర్యంలో మంగళవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటి ఫీవర్ సర్వే, డ్రై డే కార్యక్రమాలు నిర్వహించారు. ఈ మేరకు గ్రామస్తులకు సీజనల్ వ్యాధులు, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై అవగాహన కల్పించారు. బీపీ, షుగర్ బాధితులతోపాటు 47 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఆరుగురు జ్వర పీడితుల నుంచి రక్త నమూనాలు సేకరించి పరీక్ష చేశారు. అలాగే నర్సింహాసాగర్, వాడగూడెంలో ఇంటింటి ఫీవర్ సర్వే, డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో ఏఎన్ఎం సీతమ్మ, సారమ్మ, ఆశ కార్యకర్తలు నాగమణి, అనిత తదితరులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు బానిస కావొద్దు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై రామకృష్ణ

ములుగు రూరల్ : విద్యార్థులు మత్తు పదార్థాలకు బానిస కావొద్దని, వాటికి దూరంగా ఉండాలని ములుగు రెండో ఎస్సై రామకృష్ణ తెలిపారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని బండారుపల్లి మోడల్ పాఠశాల, కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాలలో ర్యాగింగ్‌కు పాల్పడడం చట్టరీత్యా నేరమని సూచించారు. విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎన్.శోభారాణి, ఉపాధ్యాయులు రవిప్రసాద్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమస్య పరిష్కారానికి భారీ సభ

మంగపేట : మండలంలోని బిల్ట్ కార్మికుల సమస్య పరిష్కారానికి త్వరలో నిర్వహించ తలపెట్టిన భారీ సభకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు గూడ యాదగిరి, బత్తుల వెంకటనారాయణ, పంజాల సత్యనారాయణ మంగళవారం ప్రకటనలో తెలిపారు. కార్మికులకు న్యాయం జరిగేంత వరకు పోరాటం చేసేందుకు అండగా నిలిచిన నవ సంఘ రక్షణ సమితి జాతీయ అధ్యక్షుడు పంజాల జైహింద్ గౌడ్, నాయకుల ఆధ్వర్యంలో మంత్రి కొండా సురేఖను కలిసేందుకు హైదరాబాద్‌కు వెళ్లినట్లు వారు పేర్కొన్నారు. అనంతరం రఘునాథపల్లిలోని బిల్ట్ యజమాన్యానికి చెందిన భూములను సందర్శించి అక్కడి తహసీల్దార్‌ను కలిసినట్లు వారు చెప్పారు.

బాధ్యతల స్వీకరణ



రేణుకను సన్మానిస్తున్న సిబ్బంది

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా రేణుకను నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ చిన్న బదిలీ కావడంతో ఇదే కళాశాలలో కామర్స్ విభాగం అధిపతి రేణుకకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్‌గా బాధ్యతలు అప్పగించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో అధ్యాపకులు నవీన్, వెంకటమ్మ, కనీస్‌ఫాతిమా, జ్యోతి, సంపత్, మున్ని, వంశీ, సిబ్బంది భాస్కర్, విజయలక్ష్మి ఉన్నారు.

వాడబలిజ గ్రామ కమిటీ ఎన్నిక

మంగపేట : మంగపేట వాడబలిజ నూతన గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు గౌరారపు రాంప్రసాద్ తెలిపారు. అధ్యక్షుడిగా బొల్లె అనుమంతు, ఉపాధ్యక్షుడిగా బొల్లె శ్రీను, కార్యదర్శిగా బొల్లె రఘుబాబు, ప్రధాన కార్యదర్శిగా దర్ర సతీష్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బద్ది పాపారావు, ముఖ్య సలహాదారుగా గగ్గూరి మహేష్, ప్రచార కార్యదర్శిగా పానెం నర్సింహారావు, కార్యవర్గ సభ్యులుగా ఏట్ల గణేష్, కస్స ప్రసాద్, బద్ధి సంతోష్, గగ్గూరి నాగేష్, బొల్లె శ్రావణ్, కొప్పుల నవీన్, తూనూరు గణపతి, బొల్లె గణేష్, దర్ర అశోక్, పానెం రమేష్, తోట నర్సింహారావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గ్రామ కమిటీ అధ్యక్షుడిని శాలువాతో సత్కరించి సన్మానించారు.

బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడి అమానుషం



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ములుగు రూరల్ : బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులు అమానుషమని బీజేపీ మండల అధ్యక్షుడు గాదం కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హిందూ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆయన హాజరై మాట్లాడుతూ.. బంగ్లాదేశ్‌లో హిందువులపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ నాయకులు, హిందూ పరిరక్షణ సమితి నాయకులు పాల్గొన్నారు.

పరామర్శ



పరామర్శిస్తున్న లక్ష్మణ్‌రావు

ములుగు రూరల్ : మండలంలోని జంగాలపల్లి గ్రామానికి చెందిన పెండెల రవి అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మణ్‌రావు మంగళవారం పరామర్శించారు. ఈ మేరకు బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. ఆయన వెంట గ్రంథాలయ మాజీ చైర్మన్ పోరిక గోవింద్ నాయక్, మండల అధ్యక్షుడు పాలెపు శ్రీనివాస్, ప్రదీప్‌రావు, మోహన్, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ర్యాలీకి తరలిన నాయకులు



హైదారాబాద్‌కు వెళ్తున్న నాయకులు

వెంకటాపురం(ఎం): విజయోత్సవ ర్యాలీలో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వస్తున్న మంద కృష్ణ మాదిగకు స్వాగతం పలికేందుకు మండలకేంద్రం నుంచి మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి కాడపాక శ్యాం ఆధ్వర్యంలో ఎంఎస్పీ నాయకులు తరలివెళ్లారు. నాయకులు దొమ్మటి రమేష్, వేల్పుల అనిల్, కాలేసి కిరణ్, గడ్డం రమేష్, అశోక్ తదితరులు ఉన్నారు.